
నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్
ఆదివారం 18 ఆగస్టు 2024
www.ntnews.com







సోమవారం
రక్షాబంధన్

## బ్రో! ఒక్కసారి ఆఫ్‌లైన్‌లోకి రా..!

'హే.. చెర్రీ నీకేదో లెటర్!' అనగానే..
'నాకు లెటరేంట్రా! సరిగ్గా చూడు' అన్నాడు చెర్రీ.
'నీకే మామా! ఫ్రమ్ యువర్ సిస్టర్' అన్నాడు లేఖ తీసుకున్న కొలీగ్. ఆత్రంగా లెటర్ అందుకున్నాడు చెర్రీ..

**'హాయ్..** అన్నయ్యా!! ఉభయ కుశలోపరి..'
ఉత్తరంలో మొదటి వాక్యం చదవగానే చెర్రీ ఆసక్తి రెండింతలైంది.
'నీకు గుర్తుందా?
టెక్స్ మేసేజ్‌లు, వాట్సాప్‌లు లేవప్పుడు..
ఇంటి వాకిటి అరుగుపై నువ్వూ, నేనూ ఎన్నిగంటలు తీరిగ్గా కూర్చునేవాళ్లమో!
అప్పుడు చెప్పుకొన్న విక్రమార్క-బేతాళ కథలు నాకింకా గుర్తు.
ఏ ఎమోజీలు పుట్టలేదింకా! 'అబ్బా! చాల్లేవే రాక్షసీ' అని అరిచినప్పుడు నీ ముఖంలో ఎక్స్‌ప్రెషన్ భలేగా ఉండేది. అదే నాకు ఇష్టమైన మొదటి ఎమోజీ!



అమెజాన్‌లు, ఆన్‌లైన్ డెలివరీలు మనకేం తెలుసు!
నీ చేతులతో చేసిన 'తాటిముంజె బుర్రల బండి'.. మెరుపువేగంతో వచ్చి నాకు ఇచ్చావ్ చూడు... అదే నాకు ఫస్ట్ గిఫ్ట్!
'నాకూ కొంచెం పెట్టవా!' అని నేను తింటున్న పీచు మిఠాయిలో వాటా అడగడం, నేనివ్వడం నా బెస్ట్ షేరింగ్ మూమెంట్.
ఇవన్నీ నీకు గుర్తున్నాయా అన్నయ్యా! నాకు అలాంటి మూమెంట్స్ కావాలి! కనీసం ఏడాదికి ఒక్కరోజైనా! ఈ రాఖీ పండుగ పూటైనా! అందుకే ఇలా లెటర్ రాస్తున్నా. నువ్వు పెట్టిన అన్ని ఆన్‌లైన్ గిఫ్ట్స్ డెలివరీలు క్యాన్సిల్ చేసి ఇంటికి రా..! ఆ రోజంతా ఆఫ్‌లైన్‌లోనే కాలక్షేపం చేద్దాం!'



చెర్రీ కండ్లల్లో నీళ్లు. అవి బాధతోనో.. ఆనందంతోనో వచ్చినవి కాదు. సాసరంత పేపర్ మీద.. ఓ దోసెడన్ని అక్షరాలు.. చెర్రీని పాతికేండ్లు వెనక్కి లాక్కుపోయాయి. క్యాలెండర్ గడుల్లో బందీ అయిన జ్ఞాపకాలను తన చెల్లెలు ఇలా గుర్తుచేస్తుందని అనుకోలేదు. ఫోన్ టింగ్‌మన్నది. అమెజాన్ నోటిఫికేషన్. నవ్వుకొని.. మళ్లీ లెటర్ చదవసాగాడు..

'లాస్ట్ ఇయర్.. నువ్వు అమెజాన్‌లో పంపిన ఫోన్‌తో నీ కోడలు ఆడుకుంటున్నది. హెడ్‌సెట్‌లో నీ బుజ్జి అల్లుడు వాడికి నచ్చిన పాటలు వింటున్నాడు. వీళ్ల వయసులో మనం ఎలా ఆడుకున్నామో గుర్తుందా... చెడుగుడు ఆటలో నా వల్ల నీ నుదురుకు పెద్ద గాయమైంది. అప్పుడు నాకెంత భయమేసిందో! ఇంట్లో తెలిస్తే నాన్న ఏం చేస్తారో అని ఏడ్చేశా!! అంత బాధలోనూ నన్ను ఓదార్చావ్! ఇంటికి వెళ్లాక 'చెట్టు కొమ్మను చూసుకోలేదు.. తగిలింది' అని చెబుతూ నావైపు చూసిన చూపు నాకింకా ఫ్రెష్‌గానే ఉంది. చెల్లిని భరించడం అన్నకుండే డీఫాల్ట్ ఫీచరేమో! అని నిన్ను చూస్తే తెలుస్తుంది. ఆ క్షణంలో మా అన్న సూపర్ అనిపించింది. ఈ మాట అప్పుడు చెప్పలేకపోయా కానీ, ఇప్పుడు చెబుతున్నా! మనమంతా కలిసి ఆడిన ఆటలు, అందులోని ఎమోషన్స్ అన్నీ నాతోనే ఉన్నాయి. ఏంట్రా ఇది ఇంత పెద్ద పెద్ద మాటలు మాట్లాడేస్తున్నది అనుకుంటున్నావేమో!!' చెర్రీ ముఖంలో చిరునవ్వు.

చెర్రీ ఫోన్‌కు మరో నోటిఫికేషన్. మింత్రా నుంచి.. పక్కకు స్వైప్ చేసి ఆలోచనలో పడ్డాడు. చిన్నప్పుడు ఎంత పెంకిలా ఉండేది. ఇప్పుడు ఎలా మారిపోయింది. ఉద్యోగం, పిల్లలు, కుటుంబ బాధ్యతలు.. తన బిజీలో తానుంది అనుకున్నా. కానీ, ఈ అన్నతో జర్నీని ఇంత పదిలంగా దాచుకుందంటే... అది తోబుట్టువుకు మాత్రమే తెలిసిన ఎమోషన్ ఏమో!!' అనుకుంటూ... మళ్లీ లెటర్ తడుముతూ.. చదవసాగాడు.
'అఫ్‌కోర్స్ ఈ రోజుల్లో వర్చువల్‌గానే బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటున్నారు అనుకో! ఆరేండ్లుగా మనమూ అదే చేస్తున్నాం. నేను నీకు కట్టే రాఖీలు అమెజాన్‌లో బుక్ చేస్తున్నా. నాకు ఇవ్వదలుచుకున్న గిఫ్ట్ ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేస్తున్నావ్! రెండు నిమిషాల వీడియో కాల్‌లో మూడు ముచ్చట్లు. ఈసారి అలా కుదరదు. అందుకే రాఖీలు కొన్నా పంపలేదు. వచ్చేయ్ అన్నయ్యా! మా ఇంటి వాకిట్లో అరుగు లేకపోవచ్చు. బేతాళ కథలు చెప్పుకోనవసరం లేదు. చిన్నప్పటి మన కబుర్లు గుర్తు చేసుకుందాం. నా పిల్లలకు చెబుదాం. మనం ఎలా ఆడుకున్నామో, ఎలా ఆటపట్టించుకున్నామో.. అన్నీ చెబుదాం. మనంత కాకపోయినా, కాస్తయినా వారి మధ్య రియల్ ఎమోషన్ డెవలప్ అవుతుంది. ఏమంటావ్? వచ్చేస్తావ్‌గా!! సర్లేగానీ, ఆల్రెడీ పెట్టిన ఆర్డర్లేమీ క్యాన్సిల్ చేయొద్దు! ఏదో ఎమోషన్‌లో అనేశా!!'

ఇట్లు..
నీ చెల్లి

> "నవ్వుకుంటూ.. లెటర్ జేబులో పెట్టుకున్నాడు చెర్రీ. చెల్లెలు ఊరికి టికెట్ బుక్ చేశాడు. ఇది చెర్రీ, అతని చెల్లి కథ మాత్రమే కాదు. చాలామంది ఇలాగే ఫీలవుతున్నారు. అందుకే సోదరీమణులారా వర్చువల్ అభినందనలు పక్కనపెట్టి.. అన్నదమ్ముల చేతికి స్వహస్తాలతో రాఖీ కట్టండి. వారు ఆప్యాయంగా అందించే కానుకలను అపురూపంగా అందుకోండి."

**వాళ్లు**
**కామెడీగా చూస్తే**
**ఓన్లీ నవ్వుల్స్!**
**సీరియస్‌గా చూస్తే**
**పొట్ట చెక్కలే!!**
**స్క్రీన్ మీద కనిపిస్తే చాలు...**
**ఈలలు, గోలలు!! కథ భారంగా**
**ఉన్నప్పుడు రిలీఫ్ ఇచ్చేవాడు,**
**రిలాక్స్‌డ్‌గా సాగిపోతున్న కథ వేగం**
**పెంచేవాడు కమెడియన్. కథకేమో గానీ,**
**కథనానికి మాత్రం కింగ్‌లాంటోడు. మిగతా భాషల**
**సంగతేమో కానీ, తెలుగు చిత్రసీమ మాత్రం ఆదినుంచీ**
**కమెడియన్లతో కళ కళ లాడింది. వీరిలో కొందరు**
**హీరోలయ్యారు, నిర్మాతలయ్యారు, దర్శకులుగా రాణించారు.**
**ఒక్కమాటలో చెప్పాలంటే.. వాళ్లందరూ కామెడీ కింగ్స్!**

సినిమా బాగుండాలంటే.. కథ చక్కగా కుదరాలి. కానీ, కథనం ముదిరి పాకాన పడాలంటే, పక్కన పకపక నవ్వించేవాడు ఉండాలి. ప్రేక్షకులు పక్క చూపులు చూడకుండా తెరకు అంకితమయ్యేలా హాస్యం పండాలి. మంచి బిగువు ఉన్న కథ, స్క్రిప్టుకు ప్రత్యేకంగా కామెడీ ట్రాక్ అవసరం లేదు కానీ, అన్ని సినిమాలకూ అది వర్కవుట్ కాదు. ఒక్కోసారి ఎంత గొప్ప కథకైనా కథనంలో కుదుపులు తప్పవు. ఎప్పుడైతే స్క్రీన్‌ప్లే డౌన్ అవుతుందో థియేటర్ తలుపులు తెరుచుకుంటూ ఉంటాయి. ఆడియన్స్‌లో ఒక్కొక్కరూ లేచీ బయటికి నడుస్తూ ఉంటారు. ఇది సినిమాకు ప్రమాద ఘంటిక. అలాంటి సమయంలో డౌన్ అవుతున్న సినిమాని భుజం పట్టి పైకి లేపడానికి ఓ క్యారెక్టర్ కావాలి. అక్కడ ఏదో మాయ జరగాలి. మళ్లీ సినిమా ట్రాక్ ఎక్కాలి. వాడే 'కమెడియన్'. తోలుబొమ్మలాట, బుర్రకథలు, హరికథలు, ఒగ్గు కథలు.. మొదలైన జానపద కళారూపాల్లోనూ జనం ఆవులిస్తున్నప్పుడల్లా వాళ్ల నిద్రమత్తు వదిలించేందుకు ఓ విదూషకుడుండేవాడు. అలాగే సినిమాకు కమెడియన్. ఓ విధంగా కథను బతికించడానికీ.. సమాంతరంగా నడిపించి, రక్తికట్టించడానికీ.. రచయితల మస్తిష్కంలోంచి పుట్టుకొచ్చిన సినిమా రక్షకుడు 'కమెడియన్'. అసలు తెలుగు సినిమాలో కామెడీ శకం ఎప్పుడు మొదలైంది? ఎన్ని మలుపులు తిరిగింది? అది ఇంతింతై వటుడింతై అన్న చందాన సినిమాను ఎలా ఆక్రమించింది? ఎలా శాసించింది? ఈ అంశాల గురించి కాసేపు గుర్తుచేసుకుందాం.

# కామెడీ కింగ్స్

తెలుగు తెరపై తొలి కమెడియన్ కస్తూరి శివరావ్. తొలి స్టార్ కమెడియన్ కూడా ఆయనే. తొలినాళ్లలో టెంటుహాళ్ల బయట టిక్కెట్లు చింపిన శివరావ్, తర్వాత ప్రొజెక్టర్ బాయ్‌గా ప్రమోటయ్యారు. ఆ తర్వాత నటుడై, స్టార్ కమెడియన్‌గా ఎదిగారు. స్వర్గసీమ, బాలరాజు, ముగ్గురు మరాఠీలు, మాయలమారి, రక్షరేఖ, లైలామజ్ను, మన దేశం.. ఇలా 40ల్లో వచ్చిన ప్రతి సినిమాలో కమెడియన్ అంటే శివరావే. విచిత్రమైన ఆకారం, విభిన్నమైన డైలాగ్ డెలివరీ.. వీటికి తోడు చక్కటి సంగీత జ్ఞానం. ఈ మూడూ శివరావ్‌ని తిరుగులేని కమెడియన్‌గా నిలబెట్టాయి. 'గుణసుందరికథ' చిత్రంతో ఆయన హీరోగా కూడా మారారు. 'పరమానందయ్య శిష్యులు'(1950) అనే చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించి చేతులు కాల్చుకున్నారు. 'నా జీవితంలో నేను చేసిన అతిపెద్ద తప్పు సినిమా తీయడమే' అని పలు వేదికల్లో చెప్పేవారు శివరావ్.

**అయితే** శివరావ్ ప్రభ తెలుగుతెరపై ఎక్కువకాలం వెలగలేదు. తన సమకాలీన కమెడియన్ రేలంగి వెంకటరామయ్యకు 'పాతాళభైరవి' (1951) రూపంలో పెద్ద బ్రేక్ రావడంతో శివరావ్ కెరీర్ మసకబారింది. రేలంగి కామెడీ సూపర్‌స్టార్‌గా అవతరించారు. తెలుగు సినిమా హాస్యానికి స్వర్ణయుగం మొదలైంది. రేలంగి దశాబ్దాలపాటు సినీహాస్యాన్ని శాసించారు. అంతేకాదు, 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న తొలి హాస్యనటుడిగా రికార్డు సృష్టించారు. ఆయన ఉధృతంగా ఉన్నప్పుడే పద్మనాభం కూడా దీటుగా సినిమాలు చేస్తూ సత్తా చాటారు. **కస్తూరి** శివరావు, రేలంగి, పద్మనాభం, రాజబాబు, సుత్తివేలు ఆ తర్వాత బ్రహ్మానందం.. వీళ్లని హీరోయిజంతో కూడిన హాస్యనటులు అనాలి. సినిమాల్లో ఈ స్టార్ కమెడియన్లకు ఓ సపరేట్ ట్రీట్‌మెంట్ ఉంటుంది, ఓ హీరోయిన్ ఉంటుంది. డ్యూయెట్లూ ఉంటాయి. ఇంకా మాట్లాడితే ఫైట్లు కూడా చేస్తారు. ఇదంతా ఓ రకం. వీరిలో సుత్తివేలు మినహా అందరూ సోలో హీరోలుగా నటించినవారే. రేలంగి.. పెద్దమనుషులు, పక్కయింటి అమ్మాయి చిత్రాల్లో హీరోగా చేశారు. రాజు-పేద, శభాష్‌రాజా చిత్రాల్లో హీరోతో సమానమైన పాత్రలు పోషించారు. కమెడియన్ పద్మనాభం హీరోగా సత్తాచాటాడు. 'రేఖ-మురళీ ప్రొడక్షన్స్' పతాకంపై ఎన్టీఆర్ అంతటి సూపర్‌స్టార్‌తో 'దేవత' లాంటి బ్లాక్ బస్టర్ నిర్మించాడు. శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న, జాతకరత్న మిడతంభొట్లు, పొట్టి ప్లీడర్ లాంటి చిత్రాలను నిర్మించి, తానే హీరోగా నటించాడు. 'కథానాయిక మొల్ల' సినిమాతో దర్శకుడిగా కూడా సత్తా చాటాడు. అలాగే రాజబాబు కూడా తాతామనవడు, పిచ్చోడి పెళ్లి, తిరుపతి, ఎవరికివారే యమునాతీరే, మనిషి రోడ్డునపడ్డాడు చిత్రాల్లో హీరోగా అలరించాడు. 'బాబాయ్ హోటల్'తో బ్రహ్మానందం కూడా హీరోగా అదరహో అనిపించాడు.

> "రమణారెడ్డి, అల్లు రామలింగయ్య, సుత్తి వీరభద్రరావు.. ఈ ముగ్గురి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వీరికి జనరేషన్‌తో ప్రమేయం ఉండదు. స్టార్ కమెడియన్ ఎవరైనా.. వారికి దీటుగా సమాధానమిచ్చే హాస్యనటులు ఈ ముగ్గురు."

**ఇదంతా** ఒక చరిత్ర అయితే.. అసలు కామెడీ నుంచి హీరోయిజాన్ని ఆవిష్కరించిన చరిత్ర ఆంధ్రా దిలీప్‌గా ప్రఖ్యాతి గాంచిన 'చలం'ది. ఇప్పటివరకూ మనం చెప్పుకొన్న కమెడియన్లందరూ హీరోలుగా అలా అప్పుడప్పుడు మెరిసి మాయమైన వారే. కానీ చలం మాత్రం కమెడియన్‌గా ఎంట్రీ ఇచ్చి నటుడిగా ఎదిగాడు. హీరోగా మారాడు. 'రమణచిత్ర' అనే సంస్థను స్థాపించి అద్భుతమైన చిత్రాలను నిర్మించాడు. హీరోగా ఓ వెలుగు వెలిగాడు. తెలుగు చిత్రసీమలో చలం కమెడియన్స్‌కి ఓ టార్చ్‌బేరర్. ఎందుకంటే.. కమెడియన్లు కూడా స్టార్ హీరోలు కావొచ్చని నిరూపించిన తొలి నటుడు చలం. మట్టిలోమాణిక్యం, సత్తెకాలపు సత్తెయ్య, సంబరాల రాంబాబు, బొమ్మా-బొరుసా, బుల్లెమ్మ బుల్లోడు, తోటరాముడు, లంబాడోళ్ల రాందాసు.. ఇలా హీరోగా ఎన్నో అద్భుతాలు సృష్టించాడు చలం. ఆయన సినిమాల్లో పాటలకు ఇప్పటికీ అభిమానులున్నారు. మాస్ హీరోలు రాజ్యమేలుతున్న తరుణంలో నరేశ్, రాజేంద్రప్రసాద్ లాంటి వాళ్లు చలం దారిలో పయనించే హీరోలుగా నిలబడ్డారు. అదే దారిలో పయనించి అలీ హీరోగా దాదాపు యాభై చిత్రాల్లో నవ్వులు పంచాడు. అల్లరి నరేశ్, సునీల్ లాంటి వాళ్లు కూడా సత్తా చాటుతున్నారు. ఇదంతా మన తెలుగు సినిమా నవ్వుల నక్షత్రాల జ్ఞాపకాల దొంతర. ఒక చిన్ననవ్వుతో ప్రపంచయుద్ధాలు ఆపొచ్చంటారు. అదే నవ్వుతో చెరగని చరిత్రనే సృష్టించవచ్చని రుజువుచేసిన మన కామెడీ స్టార్లకు ప్రేక్షకుడెప్పుడూ రుణగ్రస్తుడే.

... బుర్రా నరసింహ



## ఆయన లేచేసరికి.. నేను పడుకుంటా!

**అభిమానులను** అలరించాలంటే హీరోలకు ఫిట్‌నెస్ చాలా అవసరం. వయసు పైబడుతున్న కొద్దీ.. బాడీని కంట్రోల్‌లో ఉంచుకోవడం చాలా కష్టం. అలాంటిది 58 ఏండ్ల వయసులోనూ ఫిట్‌గా కనిపిస్తాడు బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్. వరుసగా జవాన్, పఠాన్ హిట్లు కొట్టి తన స్టామినాను మరోసారి నిరూపించుకున్నాడు. ఈ రెండు యాక్షన్ సినిమాల్లోనూ ఎనర్జిటిక్‌గా అలరించిన షారుఖ్ పవర్ సీక్రెట్ ఏంటో తెలుసుకోవాలని అభిమానులు ఆరాటపడుతుంటారు. వారందరినీ ఆశ్చర్యపరుస్తూ తన ఫిట్‌నెస్ రహస్యాలను బయటపెట్టాడు షారుఖ్. 'అమెరికన్ నటుడు మార్క్ వాల్‌బర్గ్ నిద్ర నుంచి లేచే సమయానికి నేను నిద్రపోతాను. షూటింగులు పూర్తి చేసుకుని అర్ధరాత్రి 2 గంటలకు ఇంటికి చేరుకుంటా. స్నానం చేసి, కాసేపు వర్కవుట్లు చేసి.. తెల్లవారుజామున 5 గంటలకు నిద్రపోతా. పది గంటలకల్లా లేచి... మళ్లీ రెడీ అయ్యి షూటింగ్‌కు వెళ్లిపోతాను. తక్కువ ఆహారం తీసుకుంటాను. పోషక విలువలు ఉండేలా చూసుకుంటాను' అని చెప్పుకొచ్చాడు కింగ్ ఖాన్.

## ఆ పాత్రలు బోర్ కొట్టేశాయ్

**మీర్జాపూర్** వెబ్‌సిరీస్‌లో బీనా త్రిపాఠి పాత్ర పోషించిన రసికా దుగ్గల్ ఇప్పుడు అందరికీ హాట్ ఫేవరేట్. 2007 నుంచి ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఆమె.. మీర్జాపూర్ తర్వాత సెలెబ్రిటీ అయ్యింది. ఆమె నటించిన వెబ్‌సిరీస్ 'లిటిల్ థామస్'ను మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిలిం ఫెస్టివల్‌లో ఈ నెల 19న ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా రసికా దుగ్గల్ మాట్లాడుతూ.. 'ఎంత మంచి క్యారెక్టర్లు చేసినా చివర్లో ఏడుపు సీన్లు ఉండాల్సిందే. అలాంటి పాత్రలు చేసి చేసి నాకు బోర్ కొట్టేసింది.



దర్శక నిర్మాతలు కూడా ఈ మధ్య కాస్త భిన్నంగా ఆలోచిస్తున్నారు. బహుశా వాళ్లకు కూడా నా ఏడుపు చూసి బోర్ కొట్టేసిందేమో! నాకంటూ కొత్త రోల్స్ ఇస్తున్నారు. అందుకు ఆనందంగా ఉంది. ఓటీటీ వల్లే అది సాధ్యమైందని అనుకుంటున్నాను. ఎన్నో సినిమాల్లో నటించాను. మీర్జాపూర్ సిరీస్‌కు వచ్చినంత పేరు దేనికీ రాలేదు. ఈ సిరీస్‌తో బాగా పాపులారిటీ వచ్చింది. అప్పటినుంచి అవకాశాలు కూడా ఎక్కువయ్యాయి' అని చెప్పుకొచ్చింది రసికా దుగ్గల్.

## ఏడుస్తూ ఇంటికి వెళ్లేదాన్ని

**చిన్న** సినిమాలతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన రష్మిక అనతి కాలంలోనే టాప్ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. 'పుష్ప'తో నేషనల్ క్రష్‌గా ఎదిగింది. అయితే ఈ స్టేజీకి అంత ఈజీగా రాలేదని చెబుతున్నది ఈ కన్నడ సౌందర్యం. 'హీరోయిన్ అవకాశం కోసం ఎన్నో ఆడిషన్స్ ఇచ్చాను. సుమారు 25 వరకు ఆడిషన్స్‌కు వెళ్లానేమో! అన్నిటిలోనూ రిజెక్ట్ చేసేవారు. నా నటనపై వాళ్లకు ఎప్పుడూ అనుమానం ఉండేది. దాన్నే నేను తట్టుకోలేక పోయేదాన్ని. సెలెక్ట్ కాలేదని తెలిసిన తర్వాత కన్నీళ్లు ఆగేవి కావు. ఏడుస్తూ ఇంటికి వెళ్లేదాన్ని. ఓ సినిమా కోసం చాలాసార్లు ఆడిషన్ చేశారు. చివరికి సెలెక్ట్ అయ్యాను. మూడు నెలలపాటు ఆ సినిమాకు సంబంధించిన వర్క్‌షాప్స్ జరిగాయి. ఇంత కష్టపడ్డ తర్వాత ఆ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయింది. ఇలా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. నన్ను నేను మెరుగుపరుచుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నా' అని చెప్పుకొచ్చింది రష్మిక. ప్రస్తుతం ఈ బ్యూటీ 'పుష్ప: ది రూల్', విక్కీ కౌశల్ నటిస్తున్న 'చవ్వా', సల్మాన్ ఖాన్ 'సికిందర్', శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కుబేర' సినిమాల్లో నటిస్తున్నది.

